నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | HANUMAKONDA



వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఫోర్టురోడ్డులోని ఈద్గాలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు



గూడూరు : ఈద్గా వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

## వక్ఫ్ బిల్లుపై నిరసనల వెల్లువ

### కేంద్రం తీరుపై ఫ్లెక్సీలు, ప్లకార్డుల ప్రదర్శన

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సోమవారం రంజాన్ రోజున నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనలు చేయడంతో పాటు 'రిజెక్ట్ వక్ఫ్ బిల్లు' నినాదాలతో ఫ్లెక్సీలు, ప్లకార్డులు ప్రదర్శించారు. తరతరాలుగా వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లింల ఆస్తులు సంరక్షించబడుతున్నాయని వాటిని కేంద్రం స్వాధీనం చేసుకొని ఇతరులకు ఇవ్వాలని చూస్తున్నదని, ముస్లింలను అణగదొక్కే ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలని కోరారు.

**హెచ్‌సీయూ భూముల విషయంలో** కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై విద్యార్థి నేతలు భగ్గుమంటున్నారు. వర్సిటీలోని 400 ఎకరాలను కార్పొరేట్‌కు కట్టబెట్టే ప్రయత్నాలు మానుకోవాలని.. భూముల పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జిలు, అక్రమ అరెస్టులు చేయడం దారుణమని మండిపడ్డారు. సోమవారం కేయూలో సీఎం దిష్టిబొమ్మ దహనానికి ఎస్ఎఫ్ఐ నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అలాగే కేయూ-2 గేట్‌తో పాటు అదాలత్ జంక్షన్, ఆర్ట్స్ కాలేజీ ఎదుట డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీఎస్ఏ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలు దహనం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే భూముల వేలం ఆలోచన విరమించుకొని, విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

- హనుమకొండ/ హనుమకొండ చౌరస్తా, మార్చి 31



కేయూలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేయకుండా లాక్కెళ్తున్న పోలీసులు

### హెచ్‌సీయూ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు

- విద్యార్థులపై లాఠీచార్జి, అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం
- సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై భగ్గుమన్న విద్యార్థి నేతలు
- కేయూలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. కొద్దిసేపు ఉద్రిక్తత
- కేయూ-2గేట్ వద్ద డీవైఎఫ్ఐ, అదాలత్ జంక్షన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మల దహనం

# ఖబడ్దార్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మొదటి గేటు ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా కేయూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులకు, పోలీసుల వాగ్వాదంతో కేయూలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే హనుమకొండ అదాలత్ జంక్షన్ వద్ద పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో, కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో, ఆర్ట్స్‌కాలేజీ ఎదుట డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డీఎస్ఏ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను 400 ఎకరాలను వేలం వేసి ఇతర ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని, విద్యార్థులు భూముల శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జి చేయిస్తూ వారిని అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలనా? లేక ప్రైవేట్ కార్పొరేట్ పాలనా? అని వారు ప్రశ్నించారు. ఓ వైపు దిక్కు రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీలొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను ధ్వంసం చేస్తుంటే ఇప్పుడున్న ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్సిటీలను నాశనం చేసేవిధంగా ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ఇబ్బందులు పడుతున్న ప్రజల రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు అధిక నిధులు కేటాయించి వాటిని అభివృద్ధి చేయాలని, ఇలాంటివి చేయకుండా ప్రభుత్వ ధనాన్ని ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు రేవంత్‌రెడ్డి దోచిపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన మానుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి ఆ భూముల జోలికి వెళ్లకుండా ఉండాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల్లో జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కన్నారావు, రాహుల్, అఖిల్, శీను, రాజ్‌కుమార్, కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు. యూనివర్సిటీ భూములను అమ్మే ఆలోచనను తక్షణమే విరమించుకొని అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేసి వారిపై మోపిన కేసులను ఎత్తివేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డీ తిరుపతి, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్, కో కన్వీనర్ ఎం గణేశ్ డిమాండ్ చేశారు.



అదాలత్ జంక్షన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


హనుమకొండ చౌరస్తా: ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న డీఎస్ఏ నాయకులు

ఈద్ ముబారక్


కరీమాబాద్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



## ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు
- కిటకిటలాడిన ఈద్గాలు


జనగామ చౌరస్తా : ఈద్గాలో ప్రార్థన చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్దా అంతా కలిసి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు అలయ్‌బలయ్ తీసుకున్నారు. పలుచోట్ల కార్యక్రమాల్లో ప్రముఖులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు మెరిసిపోయారు.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 31

## ప్రాణం తీసిన సిగరెట్ పొగ

- గుండ బ్రహ్మయ్య జాతరలో యువకుల మధ్య ఘర్షణ
- దాడి ఘటనలో యువకుడిని కొట్టి చంపిన వైనం
- కుంటపల్లిలో విషాదం.. తొమ్మిది మందిపై కేసు


చిర్ర బన్ని(ఫైల్)

సంగెం, మార్చి 31 : సిగరెట్ పొగ యువకుడి ప్రాణం తీసిన ఘటన సంగెం మండలంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పర్వతగిరి సీఐ రాజగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన చిర్ర పూల కుమారుడు బన్ని(21) డిగ్రీ చదువుతూ వరంగల్ హంటర్ రోడ్డులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీ ఉగాది నాడు గవిచర్ల గ్రామంలోని గుండ బ్రహ్మయ్య జాతరకు చిర్ర పూల, ఆమె కూతురు పూజిత, పెద్ద కుమారుడు ధని (శివ) కలిసి ఒక బైక్‌పై, చిన్న కుమారుడు బన్ని, తన స్నేహితుడు గిరిబాబుతో కలిసి ఒక బైక్ తీసుకుని వచ్చారు. ఆ తర్వాత తల్లి, సోదరి, సోదరుడు తిరిగి కుంటపల్లికి వచ్చారు. ఈ క్రమంలో ఆలయం వెనుక వైపు రాంచంద్రాపురం రోడ్డులో తన స్నేహితుడితో కలిసి బన్ని సిగరెట్ తాగుతున్నాడు. అక్కడే ఉన్న గవిచర్ల గ్రామానికి చెందిన వేల్పుల సిద్ధు పొగ వస్తుందని, దూరం వెళ్లి తాగమని హెచ్చరించగా, బన్ని ఇక్కడే తాగుతా నువ్వే ఇక్కడి నుంచి పో అని అనడంతో ఇద్దరిమధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. అక్కడే ఉన్న బన్ని స్నేహితుడు ధని(శివ)కు ఫోన్ చేయగా, అతడు వచ్చి ఇద్దరిని సముదాయించాడు. అలాగే సిద్ధు సోదరుడు వినయ్ వచ్చి తమ్ముడి తరఫున క్షమాపణ చెప్పాడు. సిద్ధు మాత్రం బన్నిపై పగ పెంచుకుని సంగెంలోని తన మేనమామలకు ఫోన్ చేసి గొడవ గురించి చెప్పాడు. దీంతో అతని మేనమామలు, తాత 8 మంది కలిసి ఆటోలో వచ్చి బన్ని, ధని, గిరిబాబుపై పిడిగుద్దులు గుద్దారు. బన్నిని టార్గెట్ చేసి మెడపై, ఛాతిపై కొట్టడంతో కిందపడిపోయాడు. వారు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు బన్నీకి సీపీఆర్ చేసి 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. బన్నీని పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని చెప్పారు.


### 9 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

బన్నీని చంపిన కేసులో 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సంగెంకు చెందిన గుండేటి సునీల్, గుండేటి మహేందర్(ధోని), గుండేటి కార్తీక్, గుండేటి రాజు, గుండేటి రాజ్‌కుమార్, మిట్టపెల్లి భరత్, గుండేటి కొమ్మాలు, వేల్పుల సిద్ధు, మిట్టపల్లి భరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజగోపాల్ తెలిపారు. పరారీలో ఉన్న వారిని వెతుకుతున్నట్లు చెప్పారు. బన్ని మృతదేహంతో సంగెం నుంచి కుంటపల్లి వరకు మోటర్ ర్యాలీ చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంగెం ఎస్సై నరేశ్ బందోబస్త్ నిర్వహించారు.


అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అంటారు. ఆపదలో ఉన్న వారిని రక్షించడంలో రక్తానిదే ప్రధాన పాత్ర. అత్యవసర సమయంలో బాధితులకు అందించేందుకు పలు బ్లడ్ బ్యాంకులు సైతం ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాలకు నేరుగా వచ్చే వారితో పాటు పలు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించి నిల్వ చేస్తుంటారు. అయితే ఇలా సేకరించిన యూనిట్లు ప్రస్తుతం పక్కదారి పడుతున్నాయా? లేక ప్రైవేట్‌కు విక్రయిస్తున్నారా? అనే అనుమానాలు ప్రస్తుతం వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశ పెట్టిన 'ఈ-రక్తకోష్' యాప్ సాక్ష్యంగా నిలుస్తున్నది. ఇటీవల ములుగు జిల్లాలో సేకరించిన రక్తం యూనిట్ల వివరాలు ఇందులో కనిపించడం లేదు. ఇక్కడ రక్తదాన శిబిరంలో పాల్గొన్న రెండు బ్లడ్ బ్యాంకుల్లో 'స్టాక్ నాట్ అవైలబుల్' అని చూపిస్తుండడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది.

- ములుగు, మార్చి 31 (నమస్తే తెలంగాణ)

- ఐఆర్‌సీ, ఎంజీఎం బ్లడ్ బ్యాంకుల్లో కనిపించని నిల్వలు
- ములుగులో 280 యూనిట్ల రక్తం సేకరణ
- ఈ-రక్తకోష్ యాప్‌లో నమోదు కాని వివరాలు
- పక్కదారి పట్టించారా? ప్రైవేటుకు విక్రయించారా?
- కేంద్రాల నిర్వాహకులపై పలు అనుమానాలు


45.96 KMs
RED CROSS
Indian Red Cross Society Blood Centre Hanamkonda
2-7-941, Opp. Dist. Collectorate, Subedari, Hanamkonda, Hanumakonda, Hanamkonda, Hanumakonda, Telangana
8367356765
ircshnk@gmail.com
Stock Not Available

స్టాక్ నాట్ అవేలబుల్ అని ఉన్న బిల్లు


44.82 KMs
GOVT.
Mahatma Gandhi Memorial Hospital Blood Centre
Room No - 101, MGM Blood Bank Hospital, Warangal, Warangal, Warangal, Telangana
9676798278
mgmhbloodbank@gmail.com
AVAILABLE
AB-Ve : 1,AB+Ve : 1,A+Ve : 18,B+Ve : 8,O-Ve : 2,O+Ve : 23

53యూనిట్ల రక్తం నిల్వ ఉన్నట్లు ఉన్న బిల్లు




# నో స్టాక్!

### రక్తం అందుబాటులో లేదు

అత్యవసర సమయంలో రోగులకు కావాల్సిన రక్తం యూనిట్ల వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ 'ఈ-రక్త్‌కోష్' అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో సమీపంలో ఉన్న బ్లడ్ బ్యాంకులు, అందులో నిల్వ ఉన్న వివిధ గ్రూప్‌ల రక్తం యూనిట్లు, రక్తదాన శిబిరాల వంటి వివరాలు అందుబాటులో ఉంటాయి. రక్తదాన శిబిరాలు, బ్లడ్ బ్యాంకుకు వచ్చి రక్తం ఇచ్చే వారి వివరాలు, గ్రూప్‌ల వారీగా యూనిట్ల సంఖ్యను ఎప్పటికప్పుడు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే కొందరు నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ-రక్త్‌కోష్ యాప్‌లో ఈ వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఉదాహరణగా హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో పాటు ఎంజీఎం దవాఖానలో కొనసాగుతున్న బ్లడ్ బ్యాంకులు నిలిచాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన సమయంలో సంబంధిత రెండు బ్లడ్ బ్యాంకుల సిబ్బంది శిబిరాలకు హాజరై రక్తాన్ని సేకరిస్తారు. ఎంజీఎం బ్లడ్ బ్యాంకులో ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు ప్రైవేటు దవాఖానలోని పేషెంట్లకు నామ మాత్రపు రుసుముతో రక్తాన్ని ఇస్తారు. రెడ్ క్రాస్‌లో మాత్రం ఫీజు వసూలు చేస్తారు.

### కనిపించని రక్త నిల్వలు

ములుగు జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 28న మెగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది 148, ఇండియన్ రెడ్ క్రాస్ (ఐఆర్‌సీ) సిబ్బంది 132, మొత్తం 280 యూనిట్ల రక్తం సేకరించారు. అయితే సేకరించిన రక్తాన్ని నిబంధనల మేరకు పలు పరీక్షలు నిర్వహించి యూనిట్ల వివరాలను ఈ-రక్త్‌కోష్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా అది ఇంత వరకు జరగలేదు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో స్టాక్ నాట్ అవైలబుల్ అని యాప్‌లో చూపిస్తున్నది. 2025 ఫిబ్రవరి 19 నుంచి ఈ యాప్‌లో వివరాలు నమోదు చేయనట్లుగా కనిపిస్తున్నది. అలాగే ఎంజీఎం బ్లడ్ బ్యాంక్‌లో జనవరి 23, 2025 నుంచి వివరాలు నమోదు చేయలేదు. అయితే వివిధ గ్రూప్‌లకు చెందిన 53రక్తం యూనిట్లు మాత్రం అందుబాటులో ఉన్నట్లు చూపిస్తున్నది. ఇటీవల ములుగులో సేకరించిన 280 రక్త యూనిట్ల వివరాలు ఈ రెండు బ్లడ్ బ్యాంకుల్లో ఎందుకు చూపించడం లేదో అర్థం కాని ప్రశ్నగా మారింది. సేకరించిన రక్తాన్ని ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులకు తరలించారా? లేక బ్లాక్ మార్కెట్‌లో విక్రయించారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ఆ యూనిట్లను కేంద్రాల నిర్వాహకులు ఏం చేశారు? అనేది చర్చనీయాంశంగా మారింది. బ్లడ్ బ్యాంక్‌లను పర్యవేక్షిస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులను ఈ విషయమై వివరణ కోరగా శిబిరాలు నిర్వహించే సమయంలో ముందస్తుగా తమ అనుమతులు పొందడంతో పాటు సేకరించిన రక్తం యూనిట్లను ఎక్కడికి తరలిస్తున్నారనే సమాచారాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. అయితే ములుగులో నిర్వహించిన రక్తదాన శిబిరానికి తమ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదన్నారు. అయితే రక్తదాన శిబిరాల పేరుతో సేకరించిన యూనిట్లను నిబంధనల మేరకు ఈ-రక్త్‌కోష్ యాప్‌లో నమోదు చేయాలని, నిర్లక్ష్యం చేస్తున్న బ్లడ్ బ్యాంకులపై శాఖాపరమైన చర్యలకు వెనుకాడేది లేదని అధికారులు పేర్కొన్నారు.




- నెల రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ల్యాండ్ రిజిస్ట్రేషన్లు
- గ్రేటర్‌లో 14 వేల మంది క్రమబద్ధీకరణ ఫీజు చెల్లింపు
- బల్దియాకు రూ. 94 కోట్ల ఆదాయం
- అర్ధరాత్రి వరకు మరింత పెరిగే అవకాశం

## ఎల్ఆర్ఎస్ @ 869


హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేస్తున్న మేయర్ గుండు సుధారాణి


హనుమకొండ/వరంగల్, మార్చి 31 : ఎల్ఆర్ఎస్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రిజిస్ట్రేషన్ ఆఫీసులకు అదనపు ఆదాయం సమకూరుంది. గత నెల 3న 25 శాతం రాయితీతో ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెగ్యులర్ డాక్యుమెంట్లతో పాటు అదనంగా 869 ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు అయినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ సెలవును ఈ కార్యాలయాలకు రద్దు చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 137 రిజిస్ట్రేషన్లు అయినట్లు పేర్కొన్నారు. జనగామ కార్యాలయంలో గరిష్ఠంగా 226 ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు కాగా కనిష్ఠంగా వర్ధన్నపేటలో ఒకటి కావడం విశేషం. అలాగే భీమదేవరపల్లిలో 50, భూపాల్‌పల్లిలో 59, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 13, కొడకండ్లలో 5, మహబూబాబాద్‌లో 101, ములుగులో 91, నర్సంపేటలో 23, పరకాలలో 3, వరంగల్ రూరల్‌లో 50, వరంగల్ ఆర్వోలో 137, ఖిలా వరంగల్‌లో 110 రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

**బల్దియాకు భారీగా ఆదాయం**

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ద్వారా బల్దియాకు రూ. 94 కోట్ల ఆదాయం సమకూరింది. సోమవారం రాత్రి 8 గంటల వరకు 14 వేల మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే అవకాశం ఉండటంతో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. సోమవారం చివరి రోజు కావడంతో పండుగలున్నా పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. ఉగాది, రంజాన్ పండుగల సెలవు దినాల్లో సైతం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలందించారు. సాంకేతిక కారణాలతో ఫీజుల మదింపులో దొర్లిన తప్పులను సరిచేశారు. అయితే ప్రభుత్వం చివరి గడువుకు 10 రోజుల ముందు ఎడిట్ ఆప్షన్ ఇవ్వటంతో ఆదాయం తగ్గిందని, ముందుగానే ఇస్తే మరింత మంది ఫీజు చెల్లించేవారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరి కొన్ని రోజులు రాయితీకి అవకాశం కల్పించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. కాగా, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పనితీరును మేయర్ గుండు సుధారాణి ప్రశంసించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లోని హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన ఆమె పండుగ రోజుల్లో సైతం విస్తృత సేవలందించిన సిబ్బందిని అభినందించారు.

## ప్లాస్టర్లు చుట్టి.. బ్యాండేజీలు కట్టి !

- యంత్ర పరికరాలకు సుస్తీ, మరమ్మతులతోనే సరి
- నాణ్యతా లోపంతో రోగులు, వైద్యులకు ఇబ్బందులు
- ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ దవాఖానల్లో ఇదీ పరిస్థితి


అత్యవసర విభాగంలో బ్యాండేజీ కట్టి వినియోగిస్తున్న ఎక్స్‌రే యంత్రం


లిఫ్ట్ పనిచేయకపోవడంతో బ్యాండేజీతో డోర్ కట్టి ఉంచిన సిబ్బంది

వరంగల్ చౌరస్తా, మార్చి 31 : పేరుకు పెద్దాస్పత్రులే కానీ వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్యసేవల్లో విషయంలో చిన్నచూపు, సౌకర్యాలు కల్పించడంలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిత్యం వేలాది మంది పేషంట్లు వచ్చే ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో అడుగడుగునా సమస్యలే గాక పరీక్షలు చేసే యంత్ర పరికరాలు మరమ్మతుకు నోచుకోక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. కొత్త యంత్రాలు తేవడం అటుంచి కనీసం పాత వాటికి రిపేర్లు చేయకుండా ప్లాస్టర్లు చుట్టి, బ్యాండేజ్ కట్టి నెట్టుకురావడం అక్కడి పరిస్థితికి అద్దంపడుతోంది. ఇలా ఏ విభాగాన్ని చూసినా దెబ్బతిని, మరమ్మతులకు గురైన యంత్ర పరికరాలే కనిపిస్తున్నాయి.

■ ఎంజీఎంలో వినియోగిస్తున్న చాలా యంత్రాలు పాతవి కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిలో సగం వరకు ప్లాస్టర్లు చుట్టి, బ్యాండేజీలతో కట్లు కట్టి ఉంటున్నాయి. వాటిని చూసిన రోగులు.. అసలు ఇవి పనిచేస్తున్నాయా?అనే అనుమానాలు కలుగక మానదు. ఇటీవల అత్యవసర విభాగంలోని ఎక్స్‌రే యంత్రంలోని ఒక భాగం ఊడిపోయి కిందపడడం త్రుటిలో ప్రమాదం తప్పింది. యంత్రానికి కనీస మరమ్మతులు చేయకుండా గాయాలకు కట్లు కట్టే బ్యాండేజ్‌తో కట్టి పెట్టి ఎక్స్‌రేలు తీయడం వారికే చెల్లింది. దాంతో యంత్ర భాగం సరైన స్థలంలో స్థిరంగా ఉండకపోవడంతో ఎక్స్‌రేలు తీసే సిబ్బంది, పరిశీలించే సమయంలో వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక ఎమర్జెన్సీ, ఓపీ, ఏఎంసీ విభాగాల్లో ఈసీజీ యంత్రాలు పూర్తిగా ప్లాస్టర్లు, బ్యాండేజీలు, ఇరత యంత్రాల వైరింగ్ వ్యవస్థతో తాత్కాలికంగా పనిచేసేలా ఏర్పాటు చేసి నెట్టుకొస్తున్నారు.

■ ఇక సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో మరీ దారుణం. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ విభాగాల్లో చాలా వరకు ఏసీలు పనిచేయడం లేదు. కొంతకాలంగా చివరి లిఫ్ట్ పనిచేయకపోవడంతో దానికి కూడా బ్యాండేజ్ కట్టి ఉంచారు. రేడియాలజీ విభాగంలో పైకప్పునకు ఏర్పాటు చేసిన సీలింగ్ ఊడిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకున్న వారు లేరు. సగం పైకప్పు ఊడిపోయిన విషయాన్ని చూసిన రోగులు మిగితా సీలింగ్ ఎప్పుడు ఊడిపడుతుందోనని అక్కడ నిలబడేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని యంత్ర పరికరాలకు శాశ్వత మరమ్మతులు చేయాలని అవసరమున్న చోట కొత్తవి తెప్పించాలని రోగులు, వైద్యులు కోరుతున్నారు.